క్లుప్తంగా

పూర్వ విద్యార్థికి సన్మానం



ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి ప్రేమ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన ప్రేమ్‌కుమార్ నవంబర్ 22న హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పీహెచ్‌డీ పొందారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలోని ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, చిత్తూరు ఎంఈఓ2 మోహన్, అరుణ, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అవగాహన కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యులు

యాదమరి: విష జ్వరాల పట్ల గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని యాదమరి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ సిబ్బందిని కోరారు. మండలంలోని దాసరాపల్లెలో సోమవారం గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బందికి వైద్యాధికారి సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో తేలికపాటి వర్షం కురుస్తున్నందున గ్రామాలు అపరిశుభ్రంగా తయారయ్యాయని చెప్పారు. దీంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. వీటి వల్ల విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బంది విష జ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమజంట

చిత్తూరు రూరల్: కులాంతర వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని వెదురుకుప్పం మండలం వెంకటరెడ్డి గ్రామానికి చెందిన నందిని, సాయికుమార్ కోరారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. తాము ఇష్టపూర్వకంగా గత నెల పెళ్లి చేసుకున్నామన్నారు. ఇంట్లో పెద్దలకు తెలియకుండా ఇన్నాళ్ల పాటు దూరంగా ఉన్నామని తెలిపారు. పెళ్లి విషయం ఇంట్లో తెలియడంతో తమకు పెద్దల నుంచి ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

గృహ సారథి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ధనంజయరెడ్డి

యాదమరి: మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ గృహ సారథి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కు టుంబానికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి రూ.25 వేలు ఆర్థికసాయం చేశారు. మండలంలోని కాశిరాళ్ల గ్రామంలో గృహ సారథిగా పని చేస్తున్న అశోక్ పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయ న కుటుంబానికి జెడ్పీ వైస్ చైర్మన్ రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు.

పశు సంపదను కాపాడుకుందాం

పశు సంపదను కాపాడుకోవడానికి రైతులు కొద్దిపాటి శ్రద్ధ వహించాలి. పశువుల పెంపకంలో తగు జాగ్రత్తలు పాటిస్తే అధికంగా పునరుత్పత్తి సాధ్యమవుతుంది. చూడి పశువుల్లో, దూడల పెంపకం సందర్భంగా వాటికి సరైన పోషకాలు అందిస్తే మరింత ఎదుగుదల వస్తుంది. రైతులకు వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయాన్ని ఇచ్చేది పాడి పరిశ్రమ. ఎంతోమంది రైతులు పశుపోషణపైనే ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మరెందరో నిరుద్యోగులు కూడా పశువుల పెంపకాన్ని ఆశ్రయించి ఉపాధి పొందుతూ ఇంకొందరికి ఆధారం చూపుతున్నారు. పాడి పశువులు సకాలంలో ఎదకు వచ్చి సుడికట్టాలి. కనుక పశువుల ఆరోగ్యం పునరుత్పత్తిపై పశు పోషకులు దృష్టి సారించాలి.

- పశువులు ఎదకు వచ్చే తరుణమిదే
- కృత్రిమ గర్భధారణే ఉత్తమం
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



చిత్తూరు మండలంలో పశువైద్య శిబిరానికి వచ్చిన పశువులు (ఫైల్)

చిత్తూరు రూరల్: నియోజకవర్గంలో మొత్తం పశువులు 4,68,543 ఉండగా..పాడి ఆవులు 4,67,507, బర్రెలు 1,036 ఉన్నాయి. గొర్రెలు, మేకలు కలిపి 5,76,825 వరకు ఉండగా 20వేలకు పైగా కుటుంబాలు దీని ఆధారంగా చేసుకుని జీవిస్తున్నాయి. ప్రధానంగా పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకుంటూ ఆదాయం కోసం శ్రమిస్తున్నారు. ఈ పశువుల్లో కూడా మేలు రకాలైన పాడి ఆవులను ఎంచుకుంటూ పరిశ్రమ వృద్ధి కోసం పలు జాగ్రత్తలు పాటిస్తున్నారు.

ఎద సమయంలో జాగ్రత్తలు

ఆవులు ఏడాది పొడవునా ఎదకు వస్తాయి. గేదెలు మాత్రం అక్టోబర్ నుంచి జనవరి మధ్య కాలంలో 70శాతం వరకు ఎదకు వస్తాయి. వేసవి కాలం గేదెల్లో పాల దిగుబడి చాలా తక్కువగా ఉంటుంది. ఈ కాలంలో గేదెలు తక్కువ సంఖ్యలో ఎదకు వస్తాయి. పాడి రైతులు దీన్ని గమనించి ఎదకు వచ్చిన వాటిని చల్లని వాతావరణం ఉండేలా చూడాలి. పచ్చని పశుగ్రాసంతో పాటు లవణ మిశ్రమం మేతగా అందించాలి. గేదెలను రోజుకు, 3, 4 సార్లు కడగాలి. ఎండ సమయంలో గేదెలను నీడలో ఉంచాలి. పగటిపూట వెలుతురును చూడకుండా మూడు గంటల పాటు చీకటిలో ఉంచితే ఎదకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గర్భధారణ చేసిన వెంటనే రెండు గంటలకోసారి చల్లని నీటితో కడగాలి. లేదా నీటిలో ఈదించాలి. ఈ విధంగా చేస్తే చూలు నిలిచే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

కృత్రిమ గర్భధారణే మేలు

పశువులు ఎక్కువగా రాత్రిపూట లేదా తెల్ల వారుజామునే ఎదకొస్తాయి. పునరుత్పత్తి సామర్థ్యం పెరగాలంటే సరైన సమయంలో ఎదను గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించాలి. పశువుల ఎద కాలం 24 గంటలు ఉంటుంది. సాధారణంగా ఎదకు వచ్చిన 12 నుంచి 14గంటల్లోపు గర్భధారణ చేస్తే చూడి కట్టే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. అంతే ఉదయం ఎదకు వస్తే మరుసటి రోజు ఉదయం కృత్రిమ గర్భధారణ తప్పక చేయించాలి. మరుసటి రోజు కూడా ఎద లక్షణాలు కనిపిస్తే రెండోసారి కూడా గర్భధారణ చేయించాలి. కృత్రిమ గర్భధారణ చేయించిన తరువాత వేసవి కాలమైతే ప్రతి రెండు గంటలకోసారి చల్లని నీటితో కడిగి 90 రోజుల తరువాత మరోసారి చూడి పరీక్ష చేయించాలి.

పెయ్యదూడల పోషణపై శ్రద్ధ

పాడి పశువులు ఆరోగ్యంగా రోగ నిరోధకశక్తి కలిగి ఉంటే వయసుకు తగిన బరువుండి సకాలంలో ఎదకు రావాలంటే పుట్టిన నాటి నుంచి పెయ్యల పోషణపై తగిన శ్రద్ధ వహించాలి. పుట్టిన పెయ్య దూడకు గంటలోపుగా జున్నుపాలు తాగించాలి. కనీసం రెండు లీటర్ల చొప్పున ఈనిన ఐదు రోజుల వరకు జున్ను పాలు తాగించాలి. దూడకు నట్టల నివారణ మందులను పుట్టిన ఏడు రోజులకు, 21 రోజులకు ప్రతి నెలా దాని బరువు ప్రకారం తాగించాలి. పెయ్య దూడలు ఆరోగ్యంగా ఉంటేనే త్వరగా ఎదకు వస్తాయి.

పునరుత్పత్తి సమస్య – నివారణ

పశువు సకాలంలో ఎదకు రాకపోతే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా పాడి పశువుకు పుష్టికరమైన పచ్చిమేత తప్పకుండా అందివ్వాలి. దాణాతో పాటు పాడి పశువులకు రోజుకు 30 నుంచి 50గ్రాముల లవణ మిశ్రమం తప్పక తినిపించాలి. పరిశుభ్రమైన తాగునీరు కనీసం రోజుకు 3 నుంచి 4 సార్లు అందించాలి. ముఖ్యంగా పాడి పశువులు గర్భకోశ వ్యాధులకు గురైతే ఉన్నచోటే నీరసంగా ఉండిపోతాయి. ఇలాంటి సమయంలో వైద్య పరీక్షలు జరిపించి మందులు అందజేయాలి. ఎద పశువుల వైపు ఆబోతు, దున్నపోతులు దృష్టి సారించడం వల్ల గర్భకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడం మేలు. శాస్త్రీయ పద్ధతిలో పెయ్య దూడల పెంపకం చేపట్టి పౌష్టికాహారం అందిస్తూ సకాలంలో ఎదకు వచ్చేలా చేస్తే పునరుత్పత్తి సామర్థ్యం పెరిగి పాడి రైతులు మంచి ఆదాయాన్ని ఆర్జించుకోవచ్చు.

జున్నుపాలు తాగించాలి



పెయ్య దూడ ఈనిన తరువాత ఐదు రోజుల వరకూ పాడి రైతులు తప్పకుండా జున్ను పాలు తాగించాలి. నట్టల నివారణ మందులు సమయానికి వేసి డాక్టర్ల సలహాలు పాటించాలి. శాస్త్రీయ పద్ధతిలో పెయ్య దూడలను పెంచుకోవాలి. ఎద సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే పాడి పశువుల పునరుత్పత్తి జరిగి రైతులు లాభాల బాటలో పయనిస్తారు.

– ప్రభాకర్, పశుసంవర్థకశాఖ జేడీ, చిత్తూరు

ఇంటి వద్దకే వైద్యం



ఫ్యామిలీ డాక్టర్‌లో పాల్గొన్న డాక్టర్ రక్షిత

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీ షియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రక్షిత అన్నారు. కమ్మతిమ్మాపల్లె గ్రామంలో సోమవారం గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. 59 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది సరిత, దివ్య, శిల్పా, శివగామి పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: మండలంలోని పుణ్యసముద్రం, మల్లకుంట గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పుణ్యసముద్రం డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. మల్లకుంటలో డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు పరీక్షలు చేసి సలహాలిచ్చారు.

శివాలయాల్లో కార్తీక దీపాల శోభ



మొగిలి శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కాణిపాకంలోని మణికంఠేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చిత్తూరు రూరల్: నగరంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కార్తీక సోమవారం సందర్భంగా అగస్తీశ్వర ఆలయం, కుళందీశ్వర ఆలయం, నాగేశ్వర ఆలయం, పలు అమ్మవారి ఆలయాల్లో కార్తీక సోమవార పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పంచామృత అభిషేకాలు, శత సహస్ర దీపాలంకరణ, గాయత్రి హోమం, పూర్ణాహుతి, రుద్రాభిషేకం చేశారు. భక్తులకు స్వామి దర్శనభాగ్యం కల్పించి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో పిండిదీపాలు వెలిగించి దీపారాధన చేశారు. వ్రతం ఆచరించిమొక్కులు చెల్లించుకున్నారు. వీరి రాకతో ఆలయాలు కిటకిటలాడాయి.

మొగిలి శివాలయంలో కార్తీకదీపాల శోభ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో తెలుగు కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. మహిళలు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలోని నెల్లి చెట్టుకు ప్రత్యేక పూజలు, ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఆలయంలోని ఉసిరి చెట్టుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి వనభోజనాలు చేశారు. హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాణిపాకంలో..

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయంలోని ఉసిరి(నెల్లిచెట్టు) చెట్టుకు మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు ఆలయంలోని ఉసిరిచెట్టు వద్ద పిండిదీపాలు వెలిగించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వైఎస్సార్ ఆశయాలతో ముందుకు వెళదాం

గుడిపాల: వైఎస్సార్ ఆశయాలతో ముందుకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్, మధుసూదన్‌రాయల్, గోళ్ల హరిప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని మాజీ సైనికుడు విశ్వనాథరెడ్డి చేతుల మీదుగా వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డికి గుడిపాల నాయకులు కార్యాలయం లేదని చెప్పడంతో వెంటనే స్పందించారన్నారు. దీంతో పాటు మండలానికి ఫ్రీజర్‌బాక్స్, 50 కుర్చీలు, షామియానా అందించినట్లు చెప్పారు. మండల పరిధిలో అవసరమైన వారికి ఫ్రీజర్‌బాక్స్ ఉచితంగా అదించనున్నట్లు వివరించారు. నంగమంగళంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు తెలియడంతో వెంటనే ఆ గ్రామానికి అంబులెన్స్‌లో ఫ్రీజర్ బాక్స్‌ను పంపించారు. పార్టీ కార్యాలయంలో పూజలు నిర్వహించి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కలైఅరసి, ప్రతాప్‌రెడ్డి, విద్య, దీన,రమేష్, ఆల్బర్ట్, విజయ్, క్రిష్ణమూర్తి, వరదరాజులురెడ్డి, చిట్టిబాబు, శ్రీరాములు, నవీన్, ప్రేమ్‌కుమార్, కృష్ణారెడ్డి, కమలనాథ రెడ్డి పాల్గొన్నారు.



గుడిపాల: నంగమంగళంకు అంబులెన్స్‌లో ఫ్రీజర్‌ను పంపుతున్న నాయకులు

వర్షాకాలంలో పిల్లలు జాగ్రత్త

యాదమరి: వర్షాకాలంలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలోని ఇన్‌చార్జ్‌ను ఎంపీడీఓ శివరాజ్ ఆదేశించారు. మండల పరిధిలో తేలికపాటి వర్షం కురుస్తుండడంతో ఆయన సోమవారం వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థుల హాజరు పట్టిక, పరిసరాలు, గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. అంతా పరిశుభ్రంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షం కురుస్తున్నందున పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, ఎవరికైనా జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వాస్పత్రి వైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతల్లో తుపాను కలవరం

ఐరాల: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో వాతావరణం చల్లబడింది. మూడు రోజుల నుంచి ఆకాశం మేఘావృతం కావడంతోపాటు ఎడతెరపి లేకుండా చిరుజల్లులు కురవడంతోపాటు చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. వాతవరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తమయ్యారు. వరి కోతలను నిలిపివేశారు. కోసిన చోట వరి పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించి టార్పాలిన్లు కప్పి రక్షణ కల్పిస్తున్నారు.



ఐరాల: ధాన్యంపై కప్పిన టార్పాలిన్

పూతలపట్టులో.....

పూతలపట్టు: మండలంలో తుపాను కారణంగా సోమవారం రోజంతా వర్షం కురిసింది. అధికార యంత్రాంగం మండల ప్రజలను అప్రమత్తం చేసింది. నడింపల్లి పంచాయతీ మాదిగపల్లిలో వర్షపు నీరంతా వీధిలో నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎంపీడీఓ గౌరి అక్కడికెళ్లి నీటిని పైపులద్వారా మళ్లించారు. మండలంలోని వేపనపల్లి జాతీయ రహదారి పక్కనున్న కరెంటు స్తంభం ఈదురుగాలులకు కుప్పకూలిపోయింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్‌శాఖా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని కొత్త కరెంటు స్తంభాన్ని ఏర్పాటు చేశారు.





పూతలపట్టు: నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో గౌరి, ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభం

40 ఏళ్లలో చూడని అభివృద్ధి చేశాం



రామ్‌నగర్‌కాలనీలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసిన మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో గత 40 ఏళ్లలో లేని విధంగా అభివృద్ధి జరుగుతోందని మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రామ్‌నగర్‌కాలనీ, ఎల్‌బి పురంలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడారు. సచివాలయాల్లో సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే బోర్డును, కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. వర్షంలోనూ వారు డివిజన్‌లో పర్యటించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలతో పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం అలాంటి దుర్భర పరిస్థితి లేదన్నారు. అర్హులందరికీ సంక్షేమం అందించిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్ పూర్ణచంద్రరావు, డివిజన్ ఇన్‌చార్జి సయ్యద్, నాయకులు అల్తాఫ్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం జగనన్నతోనే సాధ్యం

బంగారుపాళెం: ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కీరమంద గ్రామ సచివాలయంలో సోమవారం సాయంత్రం సర్పంచ్ సిద్దేరాజా ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన వివరాల బోర్డును, గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు సాంబశివ, కృష్ణయ్య, సుధాకర్, త్యాగరాజులు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: కీరమందలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే ఆయుధం

బంగారుపాళెం: దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే ఆయుధమని ఎంఈఓ రమేష్‌బాబు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ, వైకల్యం కలిగిన పిల్లల తల్లిదండ్రులు బాధ పడకూడదన్నారు. వారిని ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. భవిత కేంద్రంలో చదువుకున్న అంధ విద్యార్థులు ఢిల్లీ బాబు, రేవతి ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నట్లు వెల్లడించారు. భవిత కేంద్రంలో చదువుకుంటున్న పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం రాజేంద్రన్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ఐరాల: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఎంఈఓలు రుషీంద్రబాబు, దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థిని గీతికకు వినికిడి యంత్రం అందజేశారు. భవిత విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం దివ్యాంగుల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత సురేంద్రయాదవ్, హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కవిత, సురేష్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



పూతలపట్టు: దివ్యాంగ విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అధికారులు

పూతలపట్టు: మండలంలోని భవితా కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పిల్లలకు అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అనంతరం పిల్లలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కృష్ణారెడ్డి, కోటీశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, టీచర్లు లావణ్య, సుప్రజ పాల్గొన్నారు.

ముందడుగు వేయాలి

తవణంపల్లె: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడుతూ, భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగులకు డెస్కులు, టీవీ ఏర్పాటు చేయిస్తామన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరంజని మాట్లాడుతూ భవిత కేంద్రం అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. అనంతరం ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన దివ్యాంగుల పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు.







ఐరాల: దివ్యాంగ పిల్లలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, తవణంపల్లె: బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, బంగారుపాళెం: బహుమతులందజేస్తున్న ఎంఈవో రమేష్‌బాబు

అడవి నుంచి జనారణ్యంలోకి వచ్చిన జింక



గుడిపాల: మండలంలోని పాపసముద్రం గ్రామంలో సోమవారం సాయంత్రం ఓ జింక అడవిలో నుంచి తప్పిపోయి జనావాసంలోకి వచ్చింది. వీధికుక్కలు వెంటపడడంతో జింక దారితప్పి గ్రామంలోకి వచ్చేసింది. దీంతో గ్రామస్తులు కుక్కలను తరిమి జింకను పట్టుకుని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమకుమారికి సమాచారం అందించారు. గ్రామస్తుల సాయంతో ఆమె అటవీప్రాంతంలో జింకను వదిలేశారు.